



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు
ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ఈనెల 25 వరకు ఎంపీ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ
- ఎలక్షన్ కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికలకు ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అభ్యర్థితో సహ ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. 26న స్క్రూటినీ, 29న ఉపసంహరణ మే 13న పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

మహబూబాబాద్ పార్లమెంటరీ పరిధిలోని డోర్నకల్, మానుకోట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ మే 13న ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. ములుగు, ఇల్లందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ కొనసాగుతుం దన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలో 1,813 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు..

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 15,30,367 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 7,46,982 స్త్రీలు 7,83,280 మంది, ఇతరులు 105 మంది ఉన్నట్లు అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. 1158 లోకేషన్లలో 1813 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. అన్ని పోలింగ్‌కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పూర్తయిందని, ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలను చైతన్యపరిచేందుకు స్వీప్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయ న్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు హోం ఓటింగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, అతి క్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో అందుకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారులు లోకేష్‌కుమార్, సర్ఫరాజ్‌అహ్మద్‌తో కలిసి బుధవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన సమయంలో అభ్యర్థులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 18 నుంచి 25 వరకు జరిగే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ వీసీలో మహబూబాబాద్ నుంచి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఎన్నికల విభాగం తహసీల్దార్ పవన్‌కుమార్, మానుకోట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

జిల్లాలో కన్నులపండువగా సీతారాముల పెళ్లి

- వివాహ తంతును కనులారా వీక్షించిన భక్తులు
- జిల్లా వ్యాప్తంగా కిటకిటలాడిన ఆలయాలు
- నారీ కేలాలు సమర్పించి, ప్రత్యేక పూజలు
- హాజరైన ప్రభుత్వ సలహాదారు వేం, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే



మానుకోటలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు





శ్రీరాముడి ఉత్సవ విగ్రహాన్ని ఎదుర్కోలు ఉత్సవానికి తీసుకు వస్తున్న కమిటీ బాధ్యులు



భక్తులకు తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా మానుకోట పట్టణంలో బుధవారం శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. మహబూబాబాద్‌లో శ్రీరామాలయం వద్ద ప్రత్యేకంగా మిథిలానగరం తరహాలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీసీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్రప్రభుత్వ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్-ఉమా దంపతులు, కేంద్రమాజీమంత్రి పోరిక బలరాంనాయక్, రాష్ట్ర మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, హాజరయ్యారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణోత్సవ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కనులారా వీక్షించారు. నారీ కేలాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

వేదమంత్రోచ్ఛరణల నడుమ..

మహబూబాబాద్ పట్టణంలోని గాంధీపార్కు-శ్రీరామాలయం ప్రధాన రహదారిపై మిథిలానగరాన్ని తలపించే విధంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలకు వైభవోపేతంగా అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. శ్రీరామాలయం నుంచి పెళ్లి కుమారుడిలా ముస్తాబైన శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక రథంపై బయలుదేరగా, సీతమ్మవారిని మరో ప్రత్యేక రథంపై బ్యాండ్‌మేళాలు, సన్నాయి వాయిద్యాలతో నెహ్రూసెంటర్‌కు చేర్చి ఎదుర్కోలు ఉత్సవాన్ని జరిపించారు. అక్కడి నుంచి నవవధువులైన శ్రీసీతారామచంద్రస్వాములను కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఉత్సవ కమిటీ బాధ్యులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమా దంపతులు, ఉత్సవ కమిటీ బాధ్యులు చౌడవరపు మోహన్‌రావు, ఓంనారాయణలోయా, శ్రీరాంశ్రవణ్ దంపతులు వివాహవేదికపై ఆసీనులై పెళ్లిని జరిపించారు.

మధ్యాహ్నం 12.05 గంటలకు..

స్వస్తిశ్రీ శ్రీక్రోధి నామసంవత్సరం చైత్రశుద్ధ నవమి (బుధవారం) నాడు మధ్యాహ్నం 12.05 నిమిషాలకు పునర్వసునక్షత్రయుక్త కర్కాటక, లగ్నపుష్కరాంశ శుభముహూర్తాన మిథిలానగర చక్రవర్తి శ్రీజనకమహారాజు పుత్రిక చిరంజీవి లక్ష్మీసౌభాగ్యవతి సీతాదేవిని, కోసల రాజ్యసార్వభౌముడు శ్రీదశరథ మహారాజుగారి ప్రథమ పుత్రుడు చిరంజీవి శ్రీరామచంద్రునకు ఇచ్చి.. వేదపండితులు గుడి రాధాకృష్ణమూర్తి, వెంకటకృష్ణప్రసాద్, కౌశిక్ కల్యాణోత్సవం జరిపించారు. తొలుత గణపతిపూజ, పుణ్యాహవచనం పూజకార్యక్రమాల అనంతరం పెళ్లి తంతును జరిపించారు. మిథిలానగర ప్రాంగణమంతా శ్రీరామనామస్మరణంతో మార్మోగింది. స్వామివారి కల్యాణం అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, పులిహోర, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఈ వేడుకల్లో జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి తిరుపతి దంపతులు, జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, నూనావత్ రాధ, ఘనపురపు అంజయ్య ఎడ్ల రమేష్, చుక్కల ఉదయ్‌చందర్, బాలుచౌహాన్, మార్నేని రఘు, మార్నేని కిరణ్, నిమ్మల శ్రీను, సుధాఅర్జున్‌రెడ్డి, నాళ్ల లక్ష్మీనర్సింహరావు, బోనగిరి గిరిధర్‌గుప్తా, ఇమ్మడి రవికుమార్, వేమిశెట్టి కిషోర్‌కుమార్, పాల్గొన్నారు. కల్యాణ వేడుకలకు ఆది నుంచి ఆద్యంతం వరకు ప్రోగ్రాం కన్వీనర్ పూరె గురునాథరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో ఎస్సైలు సంతోష్, శివ, ఉపేందర్ బందోబస్తు నిర్వహించారు.

- పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో అర్చకులు తాటిపాముల నర్సింహమూర్తి, ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు శ్రీసీతారాముల కల్యాణాన్ని అంగరంగవైభవంగా జరిపించారు. ఈ వేడుకలో చౌడవరపు సుధాకర్-సువర్ణ, పర్కాల రవీందర్‌రెడ్డి-లక్ష్మీ దంపతులు పీటలమీద కూర్చోగా మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.
- మునిసిపల్ 12వ వార్డు పరిధి అంబేద్కర్ కాలనీలో శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ వేడుకలో బీఆర్‌ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్-శాంతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని అనంతాద్రి స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యుల వేదమంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు.



తొర్రూరులో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మానుకోటలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



వేడుల్లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

జిల్లా వ్యాప్తంగా శ్రీరాములోరి పెళ్లిసందడి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 8లో..



సమావేశంలో మాట్లాడుతున్న వేం నరేందర్‌రెడ్డి

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్కసీటు రాదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ సీఎం వ్యాఖ్యలు అహంకారానికి పరాకాష్ట
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి : సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణను తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అప్పుల ఊబిలోకి నెట్టారని రాష్ట్రప్రభుత్వ సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదని జోస్యం చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కూడా ఉండదని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడడం అహంకారానికి పరాకాష్ట అని, ప్రజలచేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వం నిలవదని చెప్పడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. బీఆర్‌ఎస్ హయంలో రూ.లక్ష కోట్లతో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. తాగు, సాగునీటి సమస్య తలెత్తుతుందని కేసీఆర్ మట్లాడడం విడ్డూరంగా, ఉందని దీనికి బాధ్యులెవరని వారుకాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని దోచుకుతిన్న ఆయనకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతికత లేదన్నారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 10 నుంచి 14 ఎంపీ సీట్లు గెలుస్తుందని ఆయన దీమా వ్యక్తం చేశారు.

100 రోజుల పాలనలో గ్యారంటీల అమలు..

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వందరోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని వేం నరేందర్‌రెడ్డి అన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి నాలుగో రోజున మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలెండర్, భద్రాచలం రాములోరి సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని తూచ తప్పకుండా అమలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని వివరించారు. ఒక్క ఏడాదిలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో 4.50 లక్షల గృహాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ల్యాండ్, మైన్ మాఫీయాలను ఉక్కుపాదంతో అణిచి వేస్తామని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో సంతోషంగా ఉన్నారని తెలిపారు.

రేపటి సీఎం సభకు తరలిరండి..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 19న జరుపతలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు పెద్దసంఖ్యలో తరలిరావాలని వేంనరేందర్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో

నామినేషన్ల స్వీకరణకు వేళాయే..

- నేటి నుంచి లోక్‌సభ స్థానాలకు నామినేషన్లు
- ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరణ
- 26న పరిశీలన, 29న ఉపసంహరణలకు గడువు
- మే 13న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు ఎన్నికలు
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- రెండు జిల్లాల కలెక్టరేట్‌లల్లో విస్తృత ఏర్పాట్లు
- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ప్రచారం పర్వంలోకి ప్రధాన పార్టీలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్లను గురువారం నుంచి స్వీకరించనున్నారు. ఇందుకోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఈనెల 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. మే 13న రెండు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఓట్ల కోసం ప్రజాక్షేత్రంలో మండుటెండను లెక్క చేయకుండా ప్రచారపర్వంలో చెమటోడ్చుతున్నారు.

నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 4వ దశలో తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఇచ్చారు. 26వ తేదీన వచ్చిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో పరిశీలన చేయనున్నారు. 27 శనివారం, 28 ఆదివారం కావటంతో రెండు రోజులు సెలవులు. 29వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాతో పాటు ఎన్నికల గుర్తులను కూడా కేటాయించనున్నారు. మే 13వ తేదీన రెండు లోక్‌సభ పరిధిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

అభ్యర్థులు సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఈనెల 19వ తేదీన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బలరాంనాయక్ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అలాగే 21 లేదా 22వ తేదీన బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీష్‌రావు కవిత నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు గులాబీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ నామినేషన్ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత డాక్టర్ లక్ష్మణ్ వచ్చే అవకాశం ఉందని సమాచారం. అలాగే వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మొదటి సెట్ 22వ తేదీన దాఖలు చేస్తుండగా, 24వ తేదీన మరో సెట్ నామినేషన్ వేయనున్నారు. 24వ తేదీన కావ్య నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మడికొండలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ 24వ తేదీన నామినేషన్ వేయనున్నారు. అరూరి రమేష్ నామినేషన్ ఘట్టానికి బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ 22వ తేదీన నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అధికారులు సిద్ధం

ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. నగదు రవాణా, మద్యం అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌ల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. మరోవైపు మండుటెండలను సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఓట్ల వేటకు దిగుతున్నారు. కీలక నేతలను కలుసుకోవటంతో పాటు బూత్‌స్థాయి సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండటంతో ఎన్నికల ప్రచారం మరింతగా హీటెక్కనుంది.

విస్తృత ఏర్పాట్లు

నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్లలో నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3గంటల తరువాత వచ్చే నామినేషన్లను స్వీకరించరని వరంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఓటరుకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసున్నారు. ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్‌డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన లైటింగ్ సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓటర్ల లెక్క ఇదీ..! 7లో..

- వరంగల్‌లో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు

మొక్కజొన్న కంకులు దగ్ధం



చింతగూడెం శివారులో దగ్ధమైన మొక్కజొన్న కంకులు

గంగారం, ఏప్రిల్ 17 : మండలంలోని కోమట్లగూడెంకు చెందిన జాడి సాంబయ్యకు చెందిన రెండెకరాల మొక్కజొన్న తోట బుధవారం దగ్ధమైంది. బాధితుడి కథనం ప్రకారం. చింతగూడెం శివారులోని సాంబయ్యకు ఉన్న ఐదెకరాల పొలంలో యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేసుకున్నాడు. చేతి కందిన పంటకంకులు విరిచి, పొలంలో కుప్పలుకుప్పలుగా ఆరపెట్టాడు. బుధవారం ఉదయం విద్యుత్ వైర్లువద్ద మంటలు చెలరేగి నిప్పులు కిందపడటంతో ఎండిపోయిన సొప్పగడ్డి అంటుకుని రెండురరాలలో రూ.లక్ష విలువైన మొక్కజొన్న కంకులు కాలిపోయాయి. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి తనకు ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం వచ్చేలా చూడాలని సాంబయ్య కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమేష్ (ఫైల్)

దంతాలపల్లి, ఏప్రిల్ 17 : వరికోత మిషన్ ముందు సింగిల్ ఫేజ్‌వైర్లు దూరం జరిపే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన తూర్పుతండా గ్రామశివారు మేఘ్యాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం వివరాలు. మేఘ్యాతండాకు చెందిన మాలోతు రమేష్ (35) బుధవారం తన వ్యవసాయ పొలం వద్దకు వరికోత మిషన్‌ను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న సింగిల్ ఫేజ్‌వైరును ముందుకు జరిపే క్రమంలో ప్రమాదవశాత్తు కుడిచేతికి వైరుతగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య చిన్ని, కుమారుడు ఉన్నారు. సోదరుడు మాలోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని ఎస్సై తెలిపారు.

28 నుంచి దూరవిద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: ఈనెల 28 నుంచి కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 మే 5, 11, 12, 19,26, 27, 28, 29, 30 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. కేయూ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో స్టడీ సెంటర్లలో తరగతులు జరుగుతాయని తెలిపారు.

హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ పంచశీల కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, జనగామ ఆర్ఆర్ఎం కాలేజీ, ఎస్ఆర్ఆర్ కాలేజీ, కౌటలా శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీ శ్రీఆరంపూర్, స్వాతి డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట, వైష్ణవి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరుకావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

కాజీపేట, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2లో రామగిరి రైలులో మంగళవారం ఓగుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 55 - 60 యేళ్ల ఉంటుందని, తెల్ల గడ్డం, 5,4 ఎత్తు బ్లూషర్ట్‌పై వైట్‌లైన్స్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్ 87126 58609, 99498 59108కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్17: అమృత థియేటర్ సమీపంలోని గుడిబండల్ ప్రాంతానికి చెందిన తన బిడ్డ అదృశ్యమైందని తండ్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ యూనివర్శిటీలో ఎంబీఏ చదువుతున్న యువతి(23) బుధవారం మధ్యాహ్నం కిరాణం షాపునకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. చింతగట్టు క్యాంపునకు చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

డబ్ల్యూడీసీఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి మే 20వ తేదీ వరకు నెల పాటు నిర్వహించనున్న వేసవి ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వరంగల్ మండిబజార్‌లోని డబ్ల్యూడీసీఏ కార్యాలయంలో డబ్ల్యూడీసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో చాగంటి శ్రీనివాస్ పాల్గొని వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల వివరాలను వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వరంగల్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ 5 సెంటర్లను ఎంపిక చేయగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే క్రీడాకారులకు గురువారంతో గడువు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

అండర్-14, 16, 19, 23 బాల బాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిసామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ప్రతీ సెంటర్‌లో పాల్గొనే క్రీడాకారులకు జంబో క్రికెట్ కిట్, మ్యాట్, బ్యాక్‌నెట్, గ్రేస్‌బాల్స్, టెన్నిస్‌బాల్స్‌తో పాటు శిబిరంలో పాల్గొనే ప్రతీ ఒక్క క్రీడాకారుడికి పౌష్టికాహారంగా కోడిగుడ్లు, అరటి పండ్లను ఉచితంగా అందిస్తామన్నారు. అదే విధంగా శిబిరాలలో కోచింగ్ ఇవ్వనున్న కోచ్‌లకు రూ.15వేలు, గ్రౌండ్ మెన్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానాన్ని చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని శ్రీనివాస్ సూచించారు.

నేటితో ముగియనున్న స్వీకరణ

హెచ్‌సీఏ ఆదేశాల మేరకు డబ్ల్యూడీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌లో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ పేర్లను టీటీటీ.జిఛిటజీఛిజ్చు.ౌటజ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే శిక్షణ శిబిరంలో పాల్గొనే అవకాశం ఉంటుదని, శిక్షణా శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫామ్‌తో రావాలని కోరారు. శిక్షణా శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు మే నెల చివరి వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీడీఎల్ - 2024 టోర్నమెంట్‌కు ఎంపిక చేయడమే కాకుండా హెచ్‌సీఏ అకాడమీకి ఎంపిక చేస్తామన్నారు.

ఐదు జిల్లా కేంద్రాల్లో శిక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఐదు జిల్లా కేంద్రాలలోని క్రీడా మైదానాలలో శిక్షణా శిబిరాలను ఎంపిక చేశారు. వరంగల్ ఎల్బీ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు గోవిందసింగ్, బి.వేణు, మహిళా కోచ్ ఝాన్సీ సెల్ నెంబర్ 9849570979, పరకాల జూనియర్ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు బొజ్జం అరుణ్ సెల్ 9666206662, జయశంకర్ భూపాలపల్లి, సింగరేణి క్రీడా మైదానం కోచ్‌లు కర్ణాకర్, రాజ్‌కుమార్ సెల్ 8897805683, ములుగు తంగేడు క్రీడా మైదానంలో కోచ్‌లు మట్టెడ కుమార్, సందీప్‌నేత్ర సెల్ 9030130727, మహబూబాబాద్ సిద్ధార్థ హైస్కూల్ క్రీడా మైదానం కోచ్‌లు కుమార్, వినయ్ సెల్ 9866479666 నెంబర్‌లలో కోచ్‌లు అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డబ్ల్యూడీసీఏ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నజీమ్, రాఘురాం, ఖాజా, కార్యవర్గ సభ్యులు అభినవ్‌వినయ్, మటెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్‌లో తప్పులుంటే ఆగమే..

- అభ్యర్థులు నేర సమాచారాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సిందే
- ఆస్తులు, అప్పులను చెప్పాల్సిందే..
- అన్ని కాలమ్స్ నింపాల్సిందే

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అభ్యర్థులు నామపత్రాలతో పాటు సమర్పించే అఫిడవిట్ పత్రాలు కీలకంగా మారుతాయి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పులు ప్రమాణరూపంలో ముందే స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులున్నా.. శిక్ష పడినా.. వాటిని పొందుపరుచాలి. వీటన్నింటిని కలిపి దాఖలు చేసే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారి తీయవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు 2023లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించినట్లు నిర్ధారించి, ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నేర సమాచారం చెప్పాల్సిందే...

అభ్యర్థి తనపై క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటిని అఫిడవిట్‌లో పొందుపరచాలి. న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీలుకు వెళ్లినా వాటి సమాచారాన్ని, సామాజిక మాధ్యమాల ఖాతాల వివరాలనూ తెలపాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైన నామినేషన్ దాఖలు చేస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలో మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలి. అలాగే అభ్యర్థులు తమపై నమోదైన కేసుల వివరాలు ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలివ్వాలి.

ఆస్తులు, అప్పులు వెల్లడించాలి..

స్థిర, చరాస్తులతో పాటు చేతిలో, ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్‌ను, బీమా పాలసీలను, అప్పులు తదితర సమాచారాన్ని పొందు పర్చాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్‌లో పొందుపరుచాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది పేర్కొనాలి. స్థిరాస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను వెల్లడించాలి.అభ్యర్థి తోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలు ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయమార్గాలు, ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపనీల కాంట్రాక్టులు ఉంటే వాటిని తెలుపాలి.

అభ్యర్థి వివరాలు తెలుసుకోవడం హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటరు హక్కు. అప్పుడే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫాం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్‌ను సమర్పించాలి.

అన్ని కాలమ్స్‌ను పూర్తి చేయాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలవద్దని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో నిల్ లేదా వర్తించదు అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే రిటర్నింగ్ అధికారి నోటీస్ ఇస్తారు. అప్పుడు సవరించిన అఫడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటినీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డులపై, వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు.



ఫాం-26 నిబంధనలకు లోబడి ఉండాలి

తీగల జీవన్‌గౌడ్, న్యాయవాది



అభ్యర్థులు ఫాం-26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాల్లో కచ్చితత్వం ఉండాలి. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు.

ఓటర్ల లెక్క ఇదీ..

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- జాబితా సిద్ధం చేసిన అధికారులు

వరంగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. అలాగే ఓటును ఇతర ప్రాంతాలకు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చింది. దీంతో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గిపోయాయి. కొన్ని చోట్ల పెరిగాయి. మొత్తంగా నెల రోజుల ఓటరు డ్రైవ్‌లో వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో కొత్తగా 114 ఓట్లు మాత్రమే పెరిగాయి. మహబూబాబాద్ పరిధిలో 3,369 ఓట్లు పెరిగాయి.

వరంగల్ లోక్‌సభ పరిధిలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం వరంగల్ లోక్‌సభ పరిధిలో మొత్తం 18,16,543మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208 మంది, ఇతరులు 395మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,892 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,874 మంది ఓటర్లు ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,030 మంది, వర్ధన్నపేట నియోజకరవ్గంలో 2,72,724మంది ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 15,30,367 మంది ఓటర్లుండగా, పురుషులు 7,46,982 మంది, మహిళలు 7,83,280 మంది ఓటర్లు, ఇతరులు 105మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,58,451మంది ఓటర్లుండగా, నర్సంపేట నియోజకవర్గంలో 2,35,447 మంది, ములుగు నియోజకవర్గంలో 2,32,791 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వరంగల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	2,56,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

మానుకోట లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలో ఓటర్లు

డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	79,597	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

నెలరోజుల్లో స్వల్పంగా పెరిగిన ఓటర్లు..

లోక్‌సభ స్థానం	మార్చి 16 (2014)	ఏప్రిల్ 16(2024)	పెరిగిన ఓట్లు
వరంగల్	18,16,429	18,16,543	114
మహబూబాబాద్	15,26,998	15,30,367	3,369



పులకించిన భద్రగిరి

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు





మానుకోటలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొని, పూజలు చేస్తున్న ఖాసీం



కొత్తగూడ మండలం గుండం రామలింగేశ్వర ఆలయంలో సీతారాముల కల్యాణం



గార్ల వర్తకసంఘం భవనంలో సీతారాముల పెళ్లి నిర్వహిస్తున్న రామదండు భక్తులు



రెడ్యాలలో వెన్నం శ్రీకాంత్‌రెడ్డి దంపతులు



డోర్నకల్ వర్తక సంఘం ఆధ్వర్యంలో



బయ్యారంలో సీతారాముల కల్యాణ వేడుకలో తాళి చూపుతున్న అర్చకులు



శ్రీరామగిరి సీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దంపతులు



అనంతాద్రిలోని శ్రీజగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



మరిపెడ రామాలయంలో మంగళసూత్రాన్ని ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీలు ఆర్.సురేందర్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య



రామాలయంలో దేవతామూర్తులకు వేసే పూలదండను చూపుతున్న ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్ దంపతులు

జిల్లా వ్యాప్తంగా శ్రీరాములోరి పెళ్లిసందడి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 : జిల్లా వ్యాప్తంగా బుధవారం శ్రీసీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మరిపెడ శ్రీసీతారాముల కల్యాణమహోత్సవంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్-ప్రమీల దంపతులు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, తొర్రూరు టీచర్స్ కాలనీలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నెల్లికుదురు మండల శ్రీరామగిరి, చిన్నగూడూరు మండలం విస్సంపల్లిలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు-సంధ్యారాణి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

• మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో మాజీ సర్పంచ్ యాస రమ-వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో, శనిగపురంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో చైర్మన్ రాంశెట్టి వీరేందర్, పద్మం ఉపేంద్రమ్మ, చిట్టిమల్ల శ్రీనివాస్, పద్మం చిన్న బిక్షపతి, బానోత్ రమేష్, వేమన, వెల్పుల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

• మరిపెడ బంగ్లాలోని రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్-ప్రమీల దంపతులు, మాజీఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్.సురేందర్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నూకల నరేష్‌రెడ్డి, ఒంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, రావుల రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబరీష, మాజీ సర్పంచ్ రాంలాల్, అఫ్జల్, తాజోద్దీన్ పాల్గొన్నారు.

• చిన్నగూడూరు మండలం విస్సంపల్లి రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దంపతులు పాల్గొన్నారు. ఉగ్గంపల్లిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ పాల్గొన్నారు. అయూబ్‌పాష, సత్యనారాయణ, కొమురెల్లి, మల్లేశం, రాంసింగ్ పాల్గొన్నారు.

• దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు పెద్దముప్పారం, దాట్ల, కుమ్మరికుంట్ల, రేపోని, బొడ్లాడ, రామవరంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. దాట్లలో మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచులు సుష్మిత, మంజుల, రవీందర్, సంధ్య పాల్గొన్నారు.

• నర్సింహులపేటతో పాటు పెద్దనాగారం, కొమ్ములవంచ, కౌసల్యదేవిపల్లి, వంతడుపుల, పెద్దనాగారం, రామన్నగూడెం, ముంగిమడుగు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

• తొర్రూరులోని ఛాంబర్‌ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పాటిమీదిగల రామాలయం, ఆర్యవైశ్య మండల, పట్టణ, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరంలో, టీచర్స్ కాలనీ, దుబ్బతండా అభయాంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. టీచర్స్ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఆయా వేడుకల్లో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్, చాంబర్ అధ్యక్షుడు మచ్చ సురేష్, భక్తులు పాల్గొన్నారు.

• గార్ల మండలంలోని ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. పరుచూరు కుటుంబరావు, సీతామహాలక్ష్మి, అజ్మీర భస్సీలాల్-పద్మ, పుల్లఖండం వేణు, రమేష్‌బాబు, మహావీర్‌జైన్, కమల్‌కుమార్ అగర్వాల్, కందునూరు ఉపేందర్, విశాల్‌జైన్, ప్రవీణ్‌జైన్, శ్రీధర్, రాకేష్, కట్ట రమేష్, వెంకట్, రాంసింగ్, గౌని ముని, లింగస్వామి పాల్గొన్నారు.

• కురవిలోని రామాలయం నిర్వహించిన కల్యాణ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం బాధ్యులు కర్నాటి మల్లికార్జున్, కర్నాటి వాసు, శ్రీరాంనవీన్, వేముల ప్రసాద్, ఓంప్రకాష్, కొదుమూరి వెంకటేశ్వర్లు, సంగెం భరత్,నూతక్కి నర్సింహారావు, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీను, గుండ్రాతిమడుగులో నిర్వహించిన వేడుకల్లో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

• డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని వర్తక సంఘం ఆధ్వర్యంలో, స్థానిక రైల్వే శ్రీరామాలయం, ముల్కలపల్లిలోని శ్రీకోదండరామాలయం, తోడేళ్లగూడెంలో రాములోరి కల్యాణ మండపం వద్ద, వెన్నారంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, ఉయ్యాలవాడ సీతారామచంద్రస్వామి దేవాలయం, బంజరలో సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

• కొత్తగూడ మండలంలోని గుండం రామలింగేశ్వర ఆలయం, ఓటాయి. పొగుళ్లపల్లి, వేలుబెల్లి రామాలయాలు, వివిధ గ్రామాల్లో హనుమాన్ టెంపుళ్ల వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు.

• నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు శ్రీరామగిరి, మదనతుర్తిలో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. శ్రీరామగిరిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దంపతులు పాల్గొన్నారు. అదూరి కళాధర్‌రాజు, వినోద్‌రెడ్డి, గొల్లపల్లి యాదగిరి, వలబోజు వెంకటేశ్వర్లు, కొమ్ము అనిల్, శేషాచార్యులు పాల్గొన్నారు.

• కేసముద్రం స్టేషన్‌లోని రామమందిరం, కాట్రపల్లి, తాళ్లపూసపల్లి, కోరుకొండపల్లిలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు గుగులోతు దస్రునాయక్, ఎంపీటీసీ సునీత, నరేటి కొమురయ్య, బండి కట్టయ్య పాల్గొన్నారు.

• పెద్దవంగర మండల కేంద్రంతో పాటు చిట్యాల, ఉప్పరిగూడెం, గండ్లకుంట గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో వేముల వెంకన్న, సాంబలక్ష్మి, దుంపల సమ్మయ్య, జమున, కుమారస్వామి, అశోక్, సత్యనారాయణ, మహేష్, స్వామి పాల్గొన్నారు.

• గంగారం మండలం కోమట్లగూడెంలోని కోదండరామాలయం, గంగారం, చింతగూడెం, కాటినాగారం, దుబ్బగూడెం, కామారంతో పాటు పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. కమిటీ చైర్మన్ సైపా సురేష్, ప్రతాపని శ్రీకాంత్, పల్లె సురేష్, గుగ్గిళ్ల ప్రభాకర్, దుర్గం వేణు, ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

• బయ్యారంలోని రామాలయం, అంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు.

• సీరోలు మండల కేంద్రంతో పాటు కాంపెల్లి, చింతపల్లి, ఉప్పరిగూడెం,మన్నెగూడెం గ్రామాలు, తండాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ముస్లిం సోదరుడు

జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శుశ్రిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసీతారాములకల్యాణ మహోత్సవానికి మహ్మద్ ఖాసీం పట్టువస్త్రాలు సమర్పించారు. కేసముద్రం మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఖాసీం కులమతాలకు అతీతంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ రాము...రహీం ఒక్కడేనంటూ సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించి, వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలో డాక్టర్ రవీందర్, ఇందుభారతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఊరేగింపు..

జిల్లా కేంద్రంలో రాత్రి శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై భాజా భజంత్రీల నడుమ ఉత్సవ కమిటీ బాధ్యులు పట్టణంలోని ప్రధానరహదారుల్లో ఊరేగింపు చేపట్టారు.

రెడ్యాలలో ..

మహబూబాబాద్ రూరల్ :

మహబూబాబాద్ మండలం రెడ్యాలలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రామమాజీ సర్పంచ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి-బిందురెడ్డి దంపతులు ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామస్తులు భారీగా తరలివచ్చి శ్రీ సీతారాముల కల్యాణాన్ని కన్నులారా వీక్షించారు. గ్రామస్తులు రాజవర్ధన్‌రెడ్డి, సురేందర్, నర్సింగ్‌శ్రీనివాస్, మల్లయ్య, సత్తిరెడ్డి, వెంకట నర్సింహారెడ్డి, అర్చకులు కృష్ణ కిశోర్‌త్రిపాఠి పాల్గొన్నారు.

‘గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి’

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 17 : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో బుధవారం రాష్ట్రప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్‌లను కేంద్రంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కృషి చేయాలన్నారు. లంబాడీలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్, భూక్య బాలాజీనాయక్, కౌన్సిలర్ భూక్య శ్రీనునాయక్, భూక్య సంతోష్, రవీందర్ పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డికి స్వాగతం పలికిన కార్యకర్తలు

నెల్లికుదురు : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి నెల్లికుదురులో కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారంస్వాగతం పలికారు. వేం నరేందర్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు చేపట్టి నూతనంగా మహబూబాబాద్‌లో జరిగే శ్రీరామనవమి వేడుకులకు వెళ్లుతున్న క్రమంలో నెల్లికుదురులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతర నెల్లికుదురు మండలంతోపాటు కేసముద్రం మండలానికి చెందిన కార్యకర్తలు తరలివచ్చి వేంనరేందర్‌రెడ్డిని పూలమాలలతో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, నెల్లికుదురు, కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, అల్లం నాగేశ్వర్‌రావు, హెచ్.వెంకటేశ్వర్లు, భైరు అశోక్‌గౌడ్, మట్ట వెంకట్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వరిపెల్లి పూర్ణచందర్, దండెపెల్లి సైదులు, పెరమాండ్ల జగన్, బెల్లి నర్సయ్య గోవర్ధన్,దాసరి ప్రకాష్, కార్యకర్తలు పాలొన్నారు.

మనిషికి కావల్సింది చిత్తశుద్ధి : గరికిపాటి



శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గరికిపాటిని సన్మానిస్తున్న సుధీర్‌రెడ్డి రాధిక కుటుంబసభ్యులు

గూడూరు, ఏప్రిల్ 17 : మనిషి కావల్సింది చిత్తశుద్ధేనని పద్మశ్రీ అవార్డు గ్రహీత మహా శాస్త్ర అవధి డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. మధనాపురంలో లింగాల సుధీర్‌రెడ్డి రాధిక దంపతులు నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గోదాసమేత వేంకటేశ్వస్వామి ఆలయ ప్రాంగణంలో గరికిపాటి ప్రవచనాల కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం మనకు చిత్తశుద్ధి లేదు, ఇంద్రియ నిగ్రహం లేదన్నారు. దండాలు పెట్టడం, ప్రదక్షిణలు చేయడం నేర్చుకున్నామని పేర్కొన్నారు. ముందు మనసులో సంతృప్తిలేదు, వెర్రి కోరికలు పిచ్చి ఆశలతో గుళ్లచుట్టు, గోపురాల చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు. ఈఆశలు తిరడానికి, భయాలు పోవడానికి ఈదారి వేతుక్కుంటున్నామని అన్నారు. మనిషికి జ్ఞానం కోసం కనుక ఆధ్యాత్మికతను వినియోగించుకో గలిగితే ఈ దేశంలో అపూర్వమైన భారతీయవైభవం అప్పుడు కనిపిస్తుందని అన్నారు. అజ్ఞానం కోసం, స్వార్థ ప్రయోజనాలకోసం వినియోగించుకుంటే క్షణం విరామం చాలు బ్రతుకు నాశనం కావడానికిఅని పేర్కొన్నారు. మనసును నిగ్రహించుకోలేక, మనసును స్వాధీనం చేసుకోలేక, మనస్సంటే ఏమిటో ఆలోచించే ఓపిక మనమనసుకే లేక మాయలో పడిపోతున్నామని స్పష్టం చేశారు. ఆత్మవిస్వాసంతో ప్రవరుడిలా ఇంద్రియ నిగ్రహంతో నిలబడగలిగితే ఎన్ని మాయలనైనా చేదించవచ్చని స్పష్టంచేశారు. అనంతరం మదనాపురంలో లింగా సుధీర్‌రెడ్డి రాధిక దంపతులు రూ . 1.50 కోట్లతో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు గరికపాటి నరసింహారావును లింగాల సుధీర్‌రెడ్డి రాధిక దంపతులు శాలువాతో సత్కరించారు

గార్ల బైరటీస్ గనులకు రక్షణ ఏది?



గార్ల, ఏప్రిల్ 17 : మండలంలోని శేరిపురం రెవెన్యూ పరిధిలో కోట్ల రూపాయల ఖనిజ సంపంద బైరటీస్ రాయికి రక్షణ కరువైంది. గత పాలకుల ప్రోద్బలంతో ఆంధ్రప్రదేశ్‌లోని చెందిన ఓ కార్పొరేషన్ సంస్థ లీజు పొంది కొంతమేర రాయిని కడపకు తరలించారు. ఆ సంస్థ వెలికితీసిన బైరటీస్ రాయిని తెలంగాణ రాష్ట్ర గనుల లీజును రద్దు చేసింది. ఈ ప్రాంతంలోని కొందరు కలసి బైరటీస్ సంస్థలో సబ్ కాంట్రాక్టర్ల పనిచేసిన వారి సహకారంతో కడపకు చెందిన ఉద్యోగి కుమ్మక్కై అధికారులకు మాముళ్లు అలవాటుచేసి, రాత్రి సమయాల్లో లక్షల రూపాయల రాయిని తరలించుకపోతున్న రాయిని అడ్డుకునే నాథుడే కరువయ్యాడు. అక్రమరాయి తరలింపుకు అడ్డుకట్ట వేయాలని కొన్ని రాజకీయ పార్టీలు ఆందోళన చేపట్టిన సమయాల్లో ఉలిక్కి పడుతున్న అధికారులు అప్పడప్పుడు వాహనాలను పట్టుకోవడం కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. వాహనాలను పట్టుకున్న కొద్ది సేపటికే అధికార పార్టీ నాయకులు మంత్రుల పీఏల ఫోన్లురావడంతో పట్టుకున్న వాహనాలను వదిలి వేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈప్రాంత ఫారెస్టు అధికారుల కనుసన్నల్లో బైరటీస్ రాయి మాయమవుతందని ఈ ప్రాంత ప్రజలు వివర్శిస్తున్నారు. దీనిపై ఎస్సై జీనత్‌కుమార్‌ను వివరణ కోరగా మంగళవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో గనుల ప్రాంతంలో రాయిని తరలించేందుకు ఖమ్మం నుంచి వచ్చిన రెంటు రాయిలేని ట్రాక్టర్లను పట్టుకున్నామని వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్‌చేసి దీనికి సంబంధించిన ఓర్సు సిద్ధు, అలకుంట రామకృష్ణ, బానోత్ అనిల్, దనుగుల కృష్ణపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై తెలిపారు.

జిల్లాలో ఓటు వినియోగంపై అవగాహన

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు స్వీప్ నోడల్ అధికారి మరియన్న ఆధ్వర్యంలో జిల్లాలోని డోర్నకల్, మానుకోట రైల్వే స్టేషన్‌లలో బుధవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారధి బృందం సభ్యులు జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్ రైల్వేస్టేషన్‌ల ప్లాట్‌ఫారంలపై పాటలు పాడుతూ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మే 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లంతా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రవీందర్, బండ వెంకన్న, సత్యనారాయణతో పాటు అధికారులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రైల్వేసేషన్‌లో ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారథి బృందం సభ్యులు

మామ గెలుపు కోసం కోడలు ప్రచారం

డోర్నకల్, ఏప్రిల్ 17 : మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ గెలుపు కోసం ఆయన చిన్న కోడలు ప్రియాంక బుధవారం డోర్నకల్‌లో ప్రచారం నిర్వహించారు. తన మామగారు అజ్మీర సీతారాంనాయక్ ఎంపీగా పనిచేసిన కాలంలో డోర్నకల్‌లో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సునీత, అమ్మాజీ ఉన్నారు.

బంగారు సూర్యచంద్రహారం బహూకరణ

గంగారం, ఏప్రిల్17 : మండలంలోని కోమట్లగూడెంలో కొలువైన కోదండ రామునికి రూ.లక్ష విలువైన బంగారు సూర్యచంద్ర హారాన్ని అదే గ్రామానికి చెందిన రైతు పల్లే సురేష్ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా బహూకరించారు. రాములోరి కల్యాణం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సైపా సురేష్, కార్యదర్శి ప్రతాపని శ్రీకాంత్‌కి అందచేసి వారి చేతులు మీదుగా శ్రీరామచంద్రునికి అలకంరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు గొగ్గిల ప్రభాకర్, దుర్గం వేణు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.51,516 విరాళం

చిన్నగూడూరు, ఏప్రిల్ 17 : ఉగ్గంపల్లిలో నూతన రామాలయ నిర్మాణానికి బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని గ్రామ ఎంపీటీసీ భర్తపురం ఉదయమ్మ కొమురెల్లి దంపతులు రూ.51,516 నగదు విరాళం గ్రామ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కమిటీసభ్యులు, గ్రామస్థులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ రాంసింగ్, మాజీ సర్పంచ్ పూలమ్మ మల్లేషం, ముత్యం సత్యనారాయణ, డీఎస్ వెంకన్న, నూకల గంగరాజు, గుగులోతు యాకన్న, బొల్లం శివయ్య, ముత్యం అంబరీష, గంగరబోయిన ఉప్పలయ్య, జక్కుల ఉప్పలయ్య, మాలోతు శంకర్, గంగధరి వెంకన్న, గుగులోతు హరి, డీఎస్ సాయి, ముత్యం రంజిత్, లెనిన్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్‌లు

చిన్నగూడూరు, ఏప్రిల్ 17 : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఆకేరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. కాగా, పట్టుకున్న ట్రాక్టర్లపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారని ఎస్సైని వివరణ కోరగా స్పందించ లేదు.

మళ్లీ హనుమకొండకే..

▸▸ నగరానికి ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం తరలింపు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17 : ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హైదరాబాద్ ఇంటర్ కమిషనర్ కార్యాలయాన్ని హనుమకొండకు తరలిస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలోని ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం ఉండేది. అక్కడి నుంచి హనుమకొండ ప్రాంతంలోని ఎక్సైజ్‌కాలనీలోని ప్రైవేట్ భవనంలో ఉండేది. అయితే రాష్ట్ర ఇంటర్ కళాశాల కమిషనర్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌లోని ఇంటర్ కమిషనరేట్ కార్యాలయానికి తరలించారు. అయితే ఇంటర్ విద్య సంఘాలు, ఇతర అధ్యాపక సంఘాల వేర్వేరు అభ్యర్థనల మేరకు ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హనుమకొండకు తరలిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీ జోన్-1 పరిధిలోని ఇంటర్ కళాశాలల పర్యవేక్షణ, జూనియర్ కళాశాల అధ్యాపకుల పదోన్న తులు, ఇతరత్రా పనులు ఆర్జేడీ కార్యాలయం నుంచి నిర్వహిస్తారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్

(5వ పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. మానుకోట పార్ల మెంటరీ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లు కాంగ్రెస్ గెలుచుకుందని ఎంపీగా పోరిక బలరాంనాయక్ 2.50 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మానుకోట జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటామని చెప్పారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని దోచుకుతిన్న ఆపార్టీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభాస్థలిని పరిశీలించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్, డోర్నకల్ జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, నాయకులు ఖలీల్ అహ్మద్, ఎడ్ల రమేష్, బండి శ్రీను, సుధాకర్, మూడు బాలుచౌహన్, రాయపురం సాంబయ్య, చల్లా లింగారెడ్డి, వంటి కొమ్ము యుగేందర్‌రెడ్డి, మూల మురళీధర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, నర్సింగం శ్రీను పాల్గొన్నారు.